## అగ్ని ప్రమాదంలో 17 మంది మృతి బాధాకరం

చిక్కడపల్లి, మే 18: చార్మినార్ సమీపంలోని గుల్జార్‌హౌస్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 17 మంది మృతి చెందటం అత్యంత బాధాకరమని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ప్రభుత్వం వారి కుటుంబాలకు అన్ని విధాలుగా ఆదుకోవాలని అన్నారు. ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు వ్యూహం అనుసరించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్ నగరంలో వరుస అగ్ని ప్రమాద ఘటనలు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ అలసత్వానికి ఏ పాపం ఎరుగని సామాన్యులు మృతి చెందడం, ఎంతో మంది క్షతగాత్రులు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు జయసింహ, మీడియా ఇన్‌చార్జి ప్రభాకర్ పాల్గొన్నారు.

## నేడు ఫీజుల నియంత్రణపై రౌండ్ టేబుల్ సమావేశం

అడ్డగుట్ట, మే 18: ప్రైవేట్ పాఠశాలల్లో ఇష్టానుసారంగా తీసుకుంటున్న ఫీజుల నియంత్రణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేస్తూ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అరకొర వసతులను కల్పిస్తూ ఫీజుల విషయంలో మాత్రం కచ్చితంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై నిఘా అవసరమని, ఫీజుల నియంత్రణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతుందని పలు సర్వేల్లో ఇప్పటికే వెల్లడైందని వారు పేర్కొన్నారు. చాలా వరకు ప్రైవేట్ పాఠశాలలు రెట్టింపు ఫీజులను వసూలు చేస్తూ తల్లిదండ్రులపై పెను భారాన్ని మోపుతున్నాయని అన్నారు.

# మార్కెట్ యార్డులో సమస్యల తిష్ఠ

- నో పార్కింగ్ జోన్‌లో భారీ వాహనాలు
- పాదచారులకు తప్పని ఇబ్బందులు
- దుర్గంధంతో ముక్కుపుటలదిరేలా..



వాహనాలు నిలపడంతో మురుగులో నుంచే రాకపోకలు



వ్యర్థాలతో దర్శనమిస్తున్న కూరగాయల మార్కెట్ ప్రాంగణం

బొల్లారం, మే 18: బోయిన్‌పల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్‌లో సమస్యలు తిష్ఠవేస్తున్నాయి. రాష్ట్రం నలుమూలల నుంచి రైతులు వివిధ రకాల కూరగాయలను ఇక్కడికి నిత్యం తీసుకొని వస్తుంటారు. ప్రతిరోజు వందలాది మంది సంచరించే బోయిన్‌పల్లి మార్కెట్ యార్డ్‌లో ఎక్కడపడితే అక్కడే వ్యర్థమైన కూరగాయలు పడేయడంతో దుర్వాసనతో చుట్టుపక్కల బస్తీవాసులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితులు నెలకొన్నాయి. టమాటా ధర లేక రైతులు దిగులు పడుతుంటే, మార్కెట్లో వ్యర్థమైన కూరగాయలు ఎక్కడ పడితే అక్కడ వేయడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. దీనికి తోడుగా చిన్నపాటి వర్షానికే మార్కెట్లో రోడ్లు మురికి కూపాలను తలపిస్తున్నాయి. ముక్కుపుటలు అదిరిపోయేలా దుర్గంధం వెదజల్లుతోందని వినియోగదారులు పేర్కొంటున్నారు. ఓవైపు నో పార్కింగ్ జోన్ ఉన్నా భారీ వాహనాలు అక్కడే పార్క్ చేస్తున్నారు. దీంతో పాదాచారాలు ఎట్లా వెళ్లాలో తెలియక తీవ్ర అవస్థలు పడుతున్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వినియోగదారులు ఈ సందర్భంగా కోరుతున్నారు.

## వైష్ణోదేవి జాగరణ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని



మారేడ్‌పల్లి, మే 18: సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో భక్తి శ్రద్ధలతో దుర్గామాత జాగరణ్ నిర్వహించారు. మా వైష్ణోదేవి జాగరణ్ మండల్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన జాగరణ్‌లో మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పాల్గొని అమ్మవారికి పూజ లు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు సురేందర్ జోషి, అరుణ వాల్యా, రాంనివాస్ బన్సాల్, పీయూష్‌గుప్తా, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## పుచ్చలపల్లి ఆశయాలను కొనసాగించాలి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి వినయ్ కుమార్

చిక్కడపల్లి, మే 18: దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, తెలంగాణ సాయుధ పోరాట ముఖ్యనాయకుల్లో ఒకరైన పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయ్ కుమార్ తెలిపారు. ఆదివారం ఎస్వీకేలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వాల్‌పోస్టర్‌ను తెలంగాణ ప్రజా సంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజర్ రమణతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ సుందరయ్య స్మృతిలో ఆయన ఆశయాలను కొనసాగించడానికి 1987లో సుందరయ్య విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభించారని తెలిపారు. విద్య, వైద్యం, నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ విజ్ఞాన కేంద్రం ద్వారా నిర్వహిస్తున్నామని వివరించారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఎస్వీకే ట్రస్ట్ అధ్యక్షుడు బీవీ రాఘవులు అధ్యక్షతన 'నేటి రాజకీయాలు-భగత్ సింగ్ ప్రాసంగికత' అంశంపై పంజాబ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ చమన్‌లాల్ ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సభలో ట్రస్ట్ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కూడా ప్రసంగిస్తారని తెలిపారు. సభ అనంతరం భగత్ సింగ్‌పై ఏకపాత్రాభినయం, నాటిక, సుందరయ్యపై రాసిన పాటలకు నృత్య ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఆటలు, వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## చలం రచనలకు స్త్రీయే వెన్నముక



చలం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

రవీంద్రభారతి, మే18 : చలం రచనలు చేసిన కాలం తరువాత ఎనిమిది దశాబ్దాలు గడిచాక కూడా ఇప్పటికి చలం రచనల గురించి మాట్లాడుకుంటున్నామంటే ఆ రచనల యొక్క సార్వకాలీనతను అర్థం చేసుకోవచ్చునని పలువురు వక్తలు పేర్కొన్నారు. జీవజలం చలం సాహిత్య స్మారకోపన్యాస సభ ఆదివారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా కెఎన్ మల్లీశ్వరి, నెల్లుట్ల రమాదేవి, డా.సలీమా, డా. లక్ష్మిఅసిరెడ్డి, డా. దాసోజు పద్మావతి, డా. శ్రీభాష్యం అనూరాధ, సభా అధ్యక్షుడుగా తెలంగాణ రచయితల సంఘం కన్వీనర్ నాళేశ్వరం శంకరం తదితరులు విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ చలం మొత్తం రచనలకు వెన్నముఖ స్త్రీ వ్యాససంపుటాలే, స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యాన్ని, స్త్రీ పురుష సమానత్వాన్ని ఏ ఆధిపత్యాలు లేని జీవితం స్త్రీ గడపాలని ఆకాక్షించారు. ఈ కార్యకరమం లో పలువురు చలం అభిమానులు, సాహితీవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

## దశలవారీగా అభివృద్ధి పనులు



అల్లాపూర్, మే 18 : దశలవారీగా అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తానని అల్లాపూర్ కార్పొరేటర్ సబియా బేగం అన్నారు. ఆదివారం రాజీవ్‌గాంధీ నగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కాంట్రాకర్‌కు సూచించారు.

## ఆకట్టుకున్న కూచిపూడి రూపకం



కొండాపూర్, మే 18: వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మాదాపూర్ శిల్పారామంలో నృత్య కిన్నెర మద్దాలి ఉషగాయత్రి శిష్య బృందం 'మాతృదేవో భవ' కూచిపూడి నృత రూపకం ప్రదర్శించారు. భమిడిపల్లి నరసింహామూర్తి సత్య, కృత, త్రేత , ద్వాపర, కలియుగాల్లో మాతృమూర్తులు పార్వతిదేవి, లీలావతి, సీత, యశోద, వకుళ దేవి ప్రేమను నృతరూపకంలో ప్రదర్శించారు. కళాకారులూ వాసవి చౌదరి, రమ్య వేణి, లక్ష్మిశ్రీ, నీరజ, ఆశ్రిత షిండే, యశస్వినీశ్రీ, తన్మయి, సహస్ర, లక్ష్మి వాత్సల్య, రసజ్ఞ, లాస్యప్రియ, సురభి, చేరిష్య, ఇరా, దీక్షిత పాల్గొన్నారు.

## యువకుడి మెడలో బంగారు చైన్ మాయం

వెంగళరావునగర్, మే 18: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ యువకుడి మెడలోని బంగారు గొలుసు చోరీకి గురైన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ఒంగోలుకు చెందిన వెంకట్‌సాయి (19) అత్తాపూర్ హైదర్‌గూడ ఈశ్వర్ థియేటర్ సమీపంలో స్నేహితులతో కలిసి ఉంటూ మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్‌లో బీటెక్ చదువుతున్నాడు. ఈ నెల 16న చదువు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు సాయంత్రం 4 గంటల ప్రాంతం లో కళ్యాణ్‌నగర్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కి మైత్రివనం బస్టాండ్‌లో దిగాడు. కొద్ది సేపటికి తన మెడలో ఉన్న 12 గ్రాముల బంగారు చైన్ కనిపించకుండా పోయింది. దీంతో బాధితుడు ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## భారత సైన్యానికి మద్దతుగా జాతీయ జెండాలతో ర్యాలీ




పద్మారావునగర్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న పలువురు

బన్సీలాల్‌పేట్, మే 18: దాయాది పాక్‌పై చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం చేసిన భారత సైన్యాన్ని అభినందిస్తూ, పద్మారావునగర్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. సైనికులకు మద్దతుగా పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడి బాల్‌రెడ్డి, సభ్యులు కలిసి భారీ ర్యాలీని విజయవంతం చేశారు.

## చట్టాల అమలులో కేంద్ర, రాష్ట్ర పభుత్వాలు విఫలం

హిమాయత్‌నగర్, మే 18: అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ ఆదివారం డిమాండ్ చేశారు. అనేక పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్నాయని ఆరోపించారు. అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు సమాన పనికి సమాన వేతనాలు కార్మికులకు అందేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. కార్మికుల కోసం నిరంతరం ఉద్యమాలు నిర్మిస్తామని పేర్కొన్నారు.

# రోడ్డు నం.12లో అడ్డంగా దొరికారు

## అనుమతి లేకుండా రోడ్డు తవ్వకం
## జీహెచ్ఎంసీ సిబ్బంది సహకారం..?

*బంజారాహిల్స్, మే 18 :* ***బంజారాహిల్స్ రోడ్డు నం 12లోని సితార హోటల్ నుంచి ఎస్‌బీఐ క్వార్టర్స్ వైపు 30 ఫీట్ల రోడ్డుపై ప్రేమ్‌చంద్‌గుప్తాలు సుమారు 600 గజాల స్థలంలో భవన నిర్మాణపనులు చేపట్టారు. ఏడాది క్రితం నిర్దేశించిన ప్రమాణాలతో భవనాన్ని నిర్మించడం లేదన్న కారణంగా జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు భవనంలో కొంతభాగాన్ని కూల్చేశారు. ఇటీవల మరోసారి పనులు చేపట్టిన నిర్మాణదారులు సివరేజ్‌లైన్ కోసం జలమండలి వద్దనుంచి అనుమతి తీసుకున్నారు. అయితే జీహెచ్ఎంసీ నుంచి రోడ్డు కటింగ్ అనుమతి కోసం నిర్దేశిత రుసుము చెల్లించకుండానే పనులు ప్రారంభించారు.***

జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులంతా బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ వద్ద మిస్ వరల్డ్ పోటీలకు సంబంధించిన ఏర్పాట్లలో బిజీగా ఉన్న విషయాన్ని తెలుసుకుని ఆదివారం పట్టపగలే ఓ బిల్డర్ ఎలాంటి అనుమతి లేకుండా సుమారు 15మీటర్ల మేర జీహెచ్ఎంసీ రోడ్డును అడ్డగోలుగా తవ్వేశారు. సమాచారం అందుకున్న జీహెచ్ఎంసీ అధికారులు అక్కడకు చేరుకోగా పనులు పూర్తిచేసి సిమెంట్‌తో మరమ్మతులు చేసేందుకు ప్రయత్నిస్తూ అడ్డంగా దొరికిపోయారు.

డీఈ అభినవ్‌కుమార్ ఆదేశాలతో అక్కడకు చేరుకున్న జీహెచ్ఎంసీ సిబ్బంది పనులను అడ్డుకున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో జీహెచ్ఎంసీకి చెందిన ఓ వర్క్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు జలమండలికి చెందిన ఓ ప్రైవేటు కాంట్రాక్టర్ కీలకపాత్ర పోషించినట్లు తెలుస్తోంది. జీహెచ్ఎంసీకి రావాల్సిన రుసుమును ఎగవేసి ప్రైవేటు వ్యక్తుల జేబుల్లోకి వెళ్లేలా చేస్తున్న చర్యలపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై బిల్డర్‌తో పాటు బాధ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఈఈ విజయ్‌కుమార్ తెలిపారు.



జీహెచ్‌ఎంసీ అధికారులు రావడంతో సిమెంట్ వేసి రోడ్డును పూడుస్తున్న దృశ్యం



బంజారాహిల్స్ రోడ్డు 12లో అనుమతి లేకుండా రోడ్డును తవ్వుతున్న దృశ్యం

## చంద్రబాగ పుస్తక పరిచయ సభ



సమావేశంలో మాట్లాడుతున్న సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.నామోజు బాలాచారి

రవీంద్రభారతి, మే18 : తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యాలయంలో నిర్వహిస్తున్న సాహిత్య వారం కార్యక్రమంలో డా.నామోజు బాలాచారి, కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షతన ప్రముఖ కథా రచయిత, అనువాదకులు డా.రూప్‌కుమార్ డబ్బీకార్ అనువదించిన జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీతల కథల అనువాద సంకలనం చంద్రభాగ పుస్తక పరిచయ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సభలో ప్రముఖ విమర్శకులు ఆచార్య టి. గౌరీశంకర్ పుస్తక పరిచయం చేస్తూ కథల్లోని సామాజిక, వైయుక్తిక, రాజకీయ వైరుధ్యాలు ఏ విధంగా వ్యవస్థలపను, మనిషిని సంఘర్షణకు గురిచేస్తున్నాయని వివరించారు. విమర్శకులు సి.ఎస్. రాంబాబు మాట్లాడుతూ.. కథల ఎన్నిక, వస్తువు గరించి అనువాదాల్లోని వ్యాక్యాలు చాలా చోట్ల కవితాత్మకంగా ఉంటూ పాఠకున్ని కట్టిపడేస్తాయి. డా. నామోజు బాలాచారి మాట్లాడుతూ.. అతెలంగాణ సాహిత్య గ్రంథాల ప్రచురణ బాధ్యతలను తీసుకోవడమే గాక ఆ గ్రంథాలను సాహిత్య రంగానికి పరిచయం చేస్తూ కవులకు, రచయితలకు సహకరిస్తుందని చెప్పారు. ఈ దిశగానే చంద్రబాగ ప్రచురించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాళేశ్వరం శంకరం, కటుకోజ్వల ఆనందాచారి, ఆడెపు లక్ష్మీపతి, హనీఫ్, ఒద్దిరాజు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## సెక్యూరిటీ గార్డు అదృశ్యం

శంషాబాద్ రూరల్, మే 18: సెక్యూరిటీ గార్డు అదృశ్యమైన సంఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం అస్సాంకు చెందిన రాజు తంతి(42)తో పాటు అతడి తమ్ముడు భీజు తంతి కలిసి ఎనిమిదేండ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చారు. శంషాబాద్ మండలం కవేలిగూడ పరిధిలోని గ్రీన్‌ఫుడ్ ఫామ్‌హౌజ్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న రాజు ఈ నెల 10 న రాత్రి గదికి తాళం వేసి చెప్పకుండా వెళ్లిపోయాడు. రెండు రోజులైనా తిరిగిరాకపోవడంతో అతనితో పాటు పని చేసే మధ్యప్రదేశ్‌కు చెందిన రాకేష్, రాజు సోదరుడు గండిపేట్ మండలంలోని ఖానాపూర్‌లో ఓ ఫాంహౌజ్‌లో పని చేస్తున్నాడు. అతడికి ఫోన్‌చేసి సమాచారం ఇవ్వడంతో వెంటనే అక్కడికి చేరుకున్న భీజు తంతి చుట్టూ పక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం శంషాబాద్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సంగీతంతో మానసిక ప్రశాంతత



హిమాయత్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో రమాప్రభను సత్కరిస్తున్న ప్రతినిధులు

హిమాయత్‌నగర్, మే 18: సంగీతంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆంధ్ర మహిళా సభ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమాప్రభ అన్నారు. రాగ తరంగిణి మ్యూజిక్ స్కూల్ వార్షికోత్సవ సంగీత వేడుకల సందర్భంగా ఆదివారం హిమాయత్‌నగర్‌లోని సరేగ స్టూడియోలో కర్ణాటక సంగీత గాత్రకచేరి జరిగింది. ఆమె మాట్లాడుతూ పిల్లలకు మంచి భవిష్యత్తు ఉందని, అంకిత భావంతో సంగీతం నేర్చుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. భారతీయ తాత్విక మూలాలు త్యాగరాజస్వామి కీర్తనల్లో దర్శన మిస్తాయన్నారు. గురుతరంగిణి శిష్యులు స్వాన్వీసిద్ధి, ప్రేక్షారెడ్డి, శ్రేష్టబైరెడ్డి ఆలపించిన మహాగణపతి, అన్నమయ్యా, త్యాగరాయ కీర్తనలు, కర్ణాటక సంగీత కచేరి ఆకట్టుకుంది. మృదంగంపై శ్రీకాంత్, వయోలిన్ పై పవన్ వాద్యం అందించారు.

## 21న ఓయూకాలనీ సహకార సంఘం ఎన్నికలు

- నామినేషన్ ప్రపోజర్‌గా చనిపోయిన వ్యక్తి సంతకం

మెహిదీపట్నం, మే 18 : షేక్‌పేట్ ఓయూ కాలనీ సహకార సంఘం ఎన్నికలు ఈనెల 20న జరగవలసి ఉంది. మాలకొండయ్య సహకార సంఘ అధికారుల ప్రోత్సాహంతో నామినేషన్ వేయడం జరిగింది. అతని నామినేషన్ ప్రపోజర్‌గా చేర్యాల రామదాసు పేరున సంతకం పెట్టారు. అతడి అడ్మిషన్ నంబరు. 66. ఇదిలా ఉండగా చేర్యాల రామదాసు 11 /9/ 2013 సంవత్సరంలోనే చనిపోయాడు. ఈ విషయం ఓటర్ లిస్టు తయారు చేసిన ప్రభుత్వ పర్సన్ ఇన్‌చార్జి బీమ్‌రాజీకి తెలుసు. గతంలో కొందరితో కుమ్మక్కై భీమరాజు చేసిన అవకతవకలు కప్పిపుచ్చుకొనుటకు తనకు అనుకూలమైన వారు ఎన్నిక అవడం కోసం చనిపోయి న వ్యక్తి పేరుతో సంతకం పెట్టించాడు. ఇదే సందర్భంగా బి. విజయ్‌కుమార్ అనే సభ్యు డు నామినేషన్ వేయడం జరిగింది. ఈయన అడ్మిషన్ నంబర్ 1085 సన్నాఫ్ సుబ్బరాయుడు వివరాలు అన్నీ సరిగా ఉ న్నా కూడా ఇంటిపేరు తప్పు ఉందని ఇత ని నామినేషన్‌ను తిరస్కరించారు. గతంలో భీమరాజ్ చేసిన అవకతవకలు ప్రశ్నించినందుకు, అతడిని తనకు వ్యతిరేకంగా భావించి ఎన్నికల అధికారి మీది ఒత్తిడి తెచ్చి ఆయన నామినేషన్ను భీమ్ రాజ్ తిరస్కరించేలా చేశాడు. ఇలా తవ్విన కొద్ది సదరు భీమరాజు చేసిన అవకతవకలు కోకొల్లలు. వీరిపైన ఈ ఘటనకు బాధ్యులైన వారి పైన తగిన చర్య తీసుకోవలసినదిగా సంఘ సభ్యులు కోరుతున్నారు.